క్లుప్తంగా

క్షీరారామంలో చండీ హోమం


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి: వైశాక బుద్ధ పూర్ణిమ సందర్భంగా సోమవారం పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో అభిషేక పండిట్ వెంకన్నచే చండీ హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దంపత సమేతంగా పీటలపై కూర్చని హోమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనం, తీర్ధ ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోదావరికి పంచ హారతులు


సిద్ధాంతంలో వశిష్ట గోదావరికి పంచ హారతులు

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం వశిష్ట గోదావరికి పంచహారతులు ఇచ్చారు. సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో సోమవారం రాత్రి కలగ భద్రుడు స్వామి అర్చకత్వంలో ఏకముఖ, ద్విముఖ, చతుర్ద, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ కుంభ, సర్ప హారాతులిచ్చారు. తొలుతత గంగా పూజలు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

లైబ్రరీలో ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

నరసాపురం: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. సోమవారం చిన్నారులకు తెలుగు అధ్యాపకులు నీటి కథలు చెప్పారు. వారితో పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగిష్ ట్రాన్స్‌లేషన్, చెస్ వంటి ఆటలు నేరి ్పంచారు. యోగ తరగతులు నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ తరగతులకు మంచి స్పందన వచ్చిందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

ముగిసిన కేశవస్వామి కల్యాణోత్సవాలు


కేశవస్వామి పుష్పోత్సవం

యలమంచిలి: ఈ నెల 6న స్థానిక విష్ణాలయంలో వైకానస ఆగమ ప్రకారం ప్రారంభమైన శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన దేవేరుల పుష్పోత్సవంతో ముగిసాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో దేవేరులకు ఉదయం అర్చనలు, కుంకుమ పూజలు, పూర్ణాహుతి, చక్రస్నానం, కంకణ ఊరేగింపు, ఆలయ బలిహరణ, ధ్వజారోహణ చేసి సాయంత్రం పుష్పోత్సవం నిర్వహించారు. పుష్పోత్సవం అనంతరం భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్ధ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా రథోత్సవాలు


ఉప్పలూరులో నిర్వహిస్తున్న చెన్నమల్లేశ్వరుని రథోత్సవం

ఉండి: ఉప్పలూరులో వేంచేసియున్న చెన్నమల్లేశ్వర స్వామి, ఉండిలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమాల్లో పాల్గొని రథాన్ని లాగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, కార్య నిర్వాహక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చల్లగా.. ఆరోగ్యంగా..

- వేసవి తాపానికి పుచ్చకాయతో ఉపశమనం
- కొనుగోలుకు ప్రజల ఆసక్తి


నరసాపురంలో విక్రయానికి ఉంచిన పుచ్చకాయలు

నరసాపురం రూరల్: ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటితే వేడిగాలులు ప్రారంభమవుతున్నాయి. ప్రజలు ఎండ వేడి, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం శీతలపానీయాలు, పుచ్చకాయలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా చల్లదనంతో పాటు పోషక విలువలు కలిగి ఉండడంతో పుచ్చకాయలు కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

జోరుగా విక్రయాలు

నరసాపురం, పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అన్ని మండలాల్లో చిరు వ్యాపారులు సైతం పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. వీటిని తమిళనాడు, కడప, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడి అమ్ముతున్నారు. ఇతర పండ్లు, ఫలాలతో పోలిస్తే పుచ్చకాయలు సరసమైన ధరలతో లభిస్తున్నాయి. వీటిని వ్యాపారులు కేజీ రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తున్నారు. ప్లేటు, కప్పులుగా చేసి రూ.20 వరకు అమ్ముతున్నారు.

పోషకాలు పుష్కలం

పుచ్చకాయలో ఏ, సీ విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం, సోడియం, పీచు, క్యాల్షియంలు విస్తారంగా ఉంటాయి. శరీరానికి అవ సరమైన శక్తినిస్తుంది. మంట, తాపాలను తగ్గిస్తుంది. ఇందులో ఉన్న విటమిన్ ఏ కంటిచూపును మెరుగు పరిస్తే, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఈ కాలంలో తరచుగా 92 శాతం నీటితో ఉన్న పుచ్చకాయ తినడం మంచిది. దీంతో వల్ల గొంతు తడారిపోవడం, ఒంట్లో నీరు ఇంకిపోవడం, డీహైడ్రేషన్ లాంటి సమస్యలు తలెత్తవు. కండరాల నొప్పులను నిరోధిస్తుంది. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ఉండదు. గుండె జబ్బులను రానీయకుండా ఉండటంతోపాటు శరీరాన్ని శుద్ధి చేస్తుంది. చర్మాన్ని సురక్షితంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిని పెరగనివ్వదు. జీర్ణప్రక్రియ సజావుగా ఉంటుంది. మూత్ర పిండాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. పుచ్చకాయ తినడం వల్ల ఆకలి తీరిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువ తినాల్సిన అవసరం ఉండదు. ఊబకాయంరాదు. బరువు తగ్గాలనుకునేవాళ్లకి ఇది శ్రేష్ఠం. ఎముకలు, దంతాలు దృఢంగా ఉంటాయి. కీళ్లనొప్పులు రావు. పుచ్చ గింజల్లో కూడా గొప్ప పోషకాలుంటాయి.

ఆరోగ్యానికి మంచిది



వేసవి కాలంలో లభించే పుచ్చకాయలు ఆరోగ్యానికి మంచిది. పుచ్చకాయలో 92 శాతం నీరు ఉంటుంది. దీంతో శరీరానికి చల్లదం లభిస్తుంది. పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. వేసవితాపం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పుచ్చకాయను తినవచ్చు. ఇందులో ఉండే ఎ విటమిన్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. ఎండ వేడికి ఒంట్లో నీరు ఇంకిపోవడం, డీహైడ్రేషన్ లాంటి సమస్యలు తలెత్తవు. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

– డాక్టర్ మావూరి మాధురి, ఎల్బీచర్ల పీహెచ్‌సీ

వ్యాపారం బాగుంది



నాన్న, నేను కలిసి ప్రతి వేసవి కాలంలోనూ పుచ్చకాయలను విక్రయిస్తుంటాం. వీటిని తిరుపతి, కడప, తమిళనాడు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. వ్యాపారం బాగానే ఉంది. అన్ని ఖర్చులు పోను వ్యాపారాన్ని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు మిగులుతుంది. పుచ్చకాయను కేజీ రూ.25 నుంచి విక్రయిస్తున్నాం. జనాలు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

– కదలి ప్రసాద్, వ్యాపారి, సారవ

తమిళనాడు పుచ్చకాయలు



వేసవి సీజన్‌లో పుచ్చకాయలను కడప, చిత్తూరు, తమిళనాడు ప్రాంతాల నుంచి టన్నుల లెక్కన కొనుగోలు చేస్తాం. కేజీ రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తున్నాం. ఉష్ణోగ్రతలు పెరగడంతో వ్యాపారం బాగా జరుగుతోంది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ చల్లదనానికి వీటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

– తోట ఏసు, పుచ్చకాయల వ్యాపారి, నరసాపురం

28న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

నరసాపురం: నూలి సాయి అభయ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28న స్థానిక హైవే ఇన్ కల్యాణ మండపంలో అండర్–19 రాష్ట్ర స్థాయి 8వ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్, బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ చెప్పారు. సోమవారం టోర్నమెంట్ పోస్టర్‌ను ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో మాస్టర్ చెస్ అకాడమీ కార్యదర్శి ఎంఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో సీపీఎం జిల్లా సమావేశాలు

నరసాపురం: స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు ఈనెల 24, 25 తేదీల్లో ఏర్పాటుచేశామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఎం త్రిమూర్తులు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరామ్ పాల్గొంటారని చెప్పారు. జిల్లా నుంచి 200 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై చర్చ ఉంటుందని వివరించారు.

భగవంతుని ఆరాధనతో మోక్షం

యలమంచిలి: పౌర్ణమి పూర్ణ దైవ జ్ఞానానికి గుర్తని, అమావాస్య అజ్ఞానానికి గుర్తని, అజ్ఞానం నుంచి వెలుగు వైపు అంటే దైవ జ్ఞానం వైపు ప్రయాణించాలని త్రైతసిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ కోరారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆశీస్సులతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడి కుదురు కమిటీ సభ్యులు సోమవారం మండలంలోని ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ప్రజలకు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు గురించి వివరించారు. అమావాస్యకు పౌర్ణమికి మధ్యలో అష్టమి తిథి రోజున శ్రీ కృష్ణుడు జన్మించి జ్ఞానం, అజ్ఞానాలకు మధ్య వారధిలా పని చేస్తున్నారని వివరించారు. మానవులంతా శ్రీకృష్ణుడిని విశ్వసించి పూజిస్తే పౌర్ణమి వైపు నడచి జ్ఞానం తెలుసుకుని మోక్షం పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడి కుదురు కమిటీ సభ్యులు హనుమంతరావు, బ్రహ్మజీ, సుబ్బారావు, సత్యవతి, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఆక్వా చెరువు తవ్వకం


యలమంచిలిలో అనుమతి లేకుండా తవ్వుతున్న ఆక్వా చెరువు

యలమంచిలి: టీడీపీ నాయకులు తమ ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా ఆక్వా చెరువులు తవ్వేస్తున్నారు. మేడపాడు – ఊటాడ పుంత రోడ్డులో కొబ్బరితోటలను ఆనుకుని ఆక్వా చెరువులు ఉన్నాయి. వాటిని ఆనుకుని ఉన్న చేలను అనుమతులు లేకుండా చెరువులుగా మారుస్తున్నారు. సుమారు ఐదెకరాలు ఉన్న చేలలో ప్రస్తుతం మూడెకరాలు చెరువు తవ్వారు. రెవెన్యూ అధికారులకు తెలిసినా అధికార పార్టీ నాయకుని వత్తిడి వల్లే పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ వివరణ కోరగా కొత్త చెరువు తవ్వకానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. అనుమతి లేకుండా చెరువు తవ్వితే అడ్డుకుని చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఘనంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

భీమవరం(ప్రకాశంచౌక్): వైశాఖ పౌర్ణమి సందర్భంగా మావుళ్లమ్మ దేవస్థానంలో సోమవారం చండీ హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ, వేదపారాయణం నిర్వహించారు. ఈ హోమంలో 58 మంది దంపతులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో 'చాంబర్స్' ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం సోమవారం విడుదల చేసిన మూడో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో పాలకొల్లు చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు 83 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధనలో చాంబర్స్ కళాశాల ప్రథమ స్థానంలో ఉందన్నారు. 64 మంది విద్యార్థులు 9.3 నుంచి 9.8 మధ్యలో గ్రేడ్ పాయింట్స్ సాధించారని చెప్పారు. అత్యుత్తమ విద్యా బోధన, ప్రమాణాలు పాటిస్తూ ఆధునిక సాంకేతిక విధానాలతో విద్యార్థులను తీర్చిదిద్దడం వల్లే ఉత్తమ ఫలితాలు సాధించామని కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు తెలిపారు. ఉత్తమ గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం తరపున నరసింహారావు, కార్యదర్శి కేవీ సీతారామరాజు, అకడమిక్ అడ్వైజర్స్ ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామరావు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు అభినందించారు.

వరల్డ్ రికార్డ్స్‌లో సూర్యకుమార్


అవార్డు అందుకుంటున్న సూర్యకుమార్

యలమంచిలి: పోడూరు మండలం వద్దిపర్రు పంచాయతీ చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కవి, రచయిత కొల్లాబత్తుల సూర్య కుమార్‌కు శ్రీశ్రీ కళావేదిక సంస్థ పలు అవార్డులతో సత్కరించింది. శ్రీశ్రీ కళావేదిక సంస్థ సాహితీ పట్టాభిషేక మహోత్సవాలు, నాలుగో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు పేరిట ఏలూరులో శని, ఆదివారాల్లో 48 గంటలపాటు నిర్వహించిన ప్రపంచ రికార్డు కార్యక్రమంలో సూర్యకుమార్ పాల్గొన్నారు. సమాజంలో సెల్ ఫోన్ అనర్థాలు అనే అంశంపై కవితా గానం చేసి, పలువురి ప్రశంసలు అందుకున్నారు. మాతృభాష పరిరక్షణ, సాహిత్య రంగాల్లో సూర్య కుమార్ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఆయనకు అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేస్తున్నట్టుగా ధ్రువీకరిస్తూ శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేసి, శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ఈశ్వరీ భూషణం, టి.పార్థసారథి తదితరులు సూర్య కుమార్‌ని అభినందించారు.

సమ్మె విజయవంతం కోరుతూ ప్రచారం


పెనుగొండలో ఉపాధి కూలీలతో నాయకులు

పెనుగొండ: ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు షేక్ పాదుషా కోరారు. సోమవారం పెనుగొండ మండలంలో ఉపాధి కార్మికులను కలిసి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని అన్నారు. కార్మికులకు కనీసం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, అధిక ధరలను అరికట్టాలని, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం విద్యుత్, రవాణా, బ్యాంకులు, ఇన్సూరెన్స్, విశాఖ స్టీల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం ప్రభుత్వ రంగ సంస్థల వల్లే అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కూలీల వెంకట్రావు, సత్యవతి, ఎస్ మంగ, చలుమూరి సత్యవతి, మరడాని నాగలక్ష్మి, కర్రి అరుణ, పూలపల్లి మంగ, మల్లుల దుర్గలు పాల్గొన్నారు.

'అనూహ్యం' నాటికకు అవార్డుల పంట


అనూహ్యం నాటికకు అవార్డులు తీసుకున్న కళాకారులు

యలమంచిలి: విజయనగరం గరివిడి కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారులు ప్రదర్శించిన అనూహ్యం నాటికకు పలు ఉత్తమ బహుమతులు వచ్చాయని నాటక రచయిత తాళాబత్తుల వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ద్వితీయ నటుడుగా రాజర్షి, ఉత్తమ హాస్య నటుడుగా గుడాల హరిబాబు, ఉత్తమ జ్యూరీ అవార్డు మాదిరెడ్డి శ్రీనివాసుకు, ఉత్తమ సంగీతం సాయితేజ పొందినట్లు తెలిపారు. నాటిక ప్రదర్శనను సినీ నటులు నరసింహరాజు, జయలలిత తిలకించి ప్రశంసించారన్నారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ తెరమీద మేము నటించే నటన కంటే నాటికలో ప్రత్యక్షంగా నటనను ప్రదర్శించే నటులు గొప్పవారని అభినందించారన్నారు. అనంతరం కళాకారులను సత్కరించి మెమొంటోలను అందజేశారన్నారు.

భక్తిశ్రద్ధలతో మాతృదేవోభవ


పాదపూజలో పాల్గొన్న దంపతులు

పాలకొల్లు సెంట్రల్: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మాతృదేవోభవ (పాదపూజ) కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కోడిగట్టు సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులచే తల్లిదండ్రులకు పాద పూజ చేయించారు. వాసవీక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు యిరుకుల రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లికి పాదపూజ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులచే పాదపూజ, ఆశీర్వచనం అందజేశారు. తల్లిదండ్రులకు క్లబ్ సభులచే నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పాదర్తి వెంకట శివ నాగేశ్వరరావు, కమిటీ చైర్మన్ పిరాట్ల శ్రీను, వీవీ రాఘవేంద్ర గుప్తా, పాల్వాది కొండ ప్రకాష్, మాటూరి నరసింహమూర్తి, మాటూరి రామ్‌కుమార్, తాడికొండ సత్యనారాయణ, సలాది వెంకట్రావు, కొప్పు సుబ్బారావు, మాటూరి కేశవ గుప్త, శ్రీకాకొల్లు మైథిలి తదితరులు పాల్గొన్నారు.

పీవీరావుకు ఘన నివాళి


పీవీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూర్య వరప్రసాద్‌రావు

యలమంచిలి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమ సూర్యుడు, మాలమహానాడు వ్యవస్థాపకుడు దివంగత పీవీ రావు 73వ జయంతి సందర్భంగా సోమవారం పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద ఆయన చిత్ర పటానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వరప్రసాద్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు పాకులాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వచ్చే ఎన్నికల్లో మాలల సత్తా ఏంటో ఓటు ద్వారా చూపిస్తామని హెచ్చరించారు. మాలలతో పెట్టుకున్న చంద్రబాబుని గతంలో మాలల పంతం, చంద్రబాబు అంతం అన్న నినాదంతో అధికారం లేకుండా చేశామని గుర్తుచేశారు. మళ్లీ అదే చరిత్ర పునరావృత్తం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు కొర్రపాటి వీరాస్వామి, వడ్లపాటి ఆనంద్ రాజు, దేవ రాజేష్, బుంగా జయరాజు, ఇంజేటి కుమారస్వామి, కోరం ముసలయ్య, పితాని పుష్పరాజ్, బొందా బుజ్జిబాబు, పిల్లి శ్యామ్, తొండ శ్రీనివాస్, రావి సుధీర్ బాబు, పెదపాటి రాజేష్, ఉటాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ విక్రయాలు ప్రారంభం


వర్మీ కంపోస్ట్ విక్రయాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కనకలక్ష్మి

యలమంచిలి: వర్మీ కంపోస్ట్‌తో ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని పాలకొల్లు ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండలంలోని అన్ని సచివాలయాల్లో తయారుచేస్తోన్న వర్మీ కంపోస్ట్‌ను విక్రయించడానికి సోమవారం పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయం వద్ద తక్కువ ధరకే అందరికీ అందుబాటులో ఉంచారు. ఎంపీపీ కనకలక్ష్మి విక్రయించగా తహసీల్దార్ దుర్గా కిషోర్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ తాళ్ల మూర్తి బాబు, ఎంఈఓ గంగాధర శర్మ, ఏఓ రామదాసు నాయుడు, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్ సాయంతో ప్రతి ఇంట్లో మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

లిఖితపూడిలో ప్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

నరసాపురం రూరల్: నరసాపురం మండలం లిఖితపూడి గ్రామంలో ఏపీ ఐఐసీ నిధులు రూ.13.60 కోట్లతో నిర్మించే ప్లాంటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, రాష్ట్ర ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు కలిసి శంకుస్థాపన చేశారు. లిఖితపూడి గ్రామంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధితో పాటు స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి లభిస్తుందని వారు తెలిపారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్కిల్ అభివృద్ధి చేసుకొని అధునాతన టెక్నాలజీతో ఇండస్ట్రియలను డెవలప్ చేసి యువతికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ దాసి రాజు, జోనల్ మేనేజర్ కె.బాబ్జి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


భీమవరం: నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

భీమవరం: పట్టణంలోని ఉండి రోడ్డు రైల్వే గేటు వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పట్నాల సీతారాంబాబును సోమవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు చెప్పారు. నిందితుడి వద్ద నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎక్సైజ్ ఎస్‌ఐలు పి.ఉమామహేశ్వరరావు, పి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరు మద్యం సీసాలు స్వాధీనం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముద్దే శ్రీనును అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వి.కరుణ ప్రియ, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమ మద్యం, సారా కేసుల్లో పట్టుబడిన ఆరు వాహనాలను ఈ నెల 17వ తేదీన ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు సీఐ చెప్పారు.

50 మందికి వైద్య పరీక్షలు


కొప్పర్రులో వైద్య పరీక్షలు చేస్తున్న జెరూష

నరసాపురం రూరల్: వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్బీచర్ల పీహెచ్‌సీ డాక్టర్ కె.జెరూష అన్నారు. సోమవారం నరసాపురం మండలం కొప్పర్రు గ్రామ సచివాలయం పరిధిలోని 50 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందింజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎం విల్సన్, ఏఎన్‌ఎం సుశీల, హెల్త్‌ఎడ్యుకేటర్ ప్రసన్న కుమార్, హెల్త్ అసిస్టెంట్ వై విజయ భాస్కర్ తదితరులు ఉన్నారు.